ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 23 ఆగస్టు 2025



ఐటెప్ కోర్సులో తొలి రోజు 80 సీట్లు భర్తీ

ఎచ్చెర్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న నాలుగేళ్ల సమీకృత విద్యా కార్యక్రమం(ఐటెప్) కోర్సులో ప్రవేశానికి శుక్రవారం వర్సిటీలో కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మొత్తం 110 సీట్లు ఉండగా, బీఎస్సీ, బీఈడీ కేటగిరీలో 53 సీట్లు, బీఏ, బీఈడీలో 27 సీట్లు భర్తీ అయ్యాయి. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ పర్యవేక్షణలో జరిగిన కౌన్సెలింగ్‌లో అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని, విద్యావిభాగం సమన్వయకర్త డాక్టర్ జేఎల్ సంధ్యారాణి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. శనివారం కూడా కౌన్సెలింగ్ జరగనుంది.

స్త్రీ శక్తికి ఆదరణ

- ఆర్టీసీ బస్సుల్లో పెరుగుతున్న మహిళా ప్రయాణికులు
- వారం రోజుల్లో 2.85 లక్షల మందికి సద్వినియోగం
- ప్రైవేటు బస్సుల్లో తగ్గిన తాకిడి

● టెక్కలి ఆర్టీసీ డిపో పరిధిలో 57 బస్సులు ఉన్నాయి. ఈ నెల 15న సాయంత్రం స్త్రీ శక్తి పథకం ప్రారంభించగా.. తొలిరోజే సుమారు వెయ్యి మంది మహిళలు బస్సులో ఉచిత ప్రయాణం చేశారు. తర్వాత రోజుకు 7 వేల మంది వరకూ మహిళలు బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. గురువారం 10వేల మందికిపైగా మహిళలు 'స్త్రీ శక్తి' పథకం కిందట బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేశారని అధికారులు తెలిపారు.

టెక్కలి రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి)

'స్త్రీ శక్తి' పథకానికి ఆదరణ పెరుగుతోంది. ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఈ నెల 15న ప్రారంభించింది. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు రకాల ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించింది. దీంతో పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సులు.. మహిళలు, యువతులు, విద్యార్థినులతో కిటకిటలాడుతున్నాయి. రోజురోజుకీ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య పెరుగుతోంది. బస్సుల్లో 80శాతం మహిళలే కనిపిస్తున్నారు. జిల్లాలోని శ్రీకాకుళం డిపో-1 పరిధిలో 97, డిపో-2లో 82, టెక్కలి డిపో పరిధిలో 57, పలాస డిపో పరిధిలో 74 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. పథకం ప్రారంభం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 2.85 లక్షల మంది మహిళలు 'స్త్రీ శక్తి' పథకం కింద బస్సుల్లో రాకపోకలు సాగించారని ఆర్టీసీ అధికారులు తెలిపారు. జిల్లాలో రోజుకు సుమారు 62 వేల మంది ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ వెల్లడించారు. 'విశాఖపట్నం, విజయనగరం, బత్తిలి, పాలకొండ, ఇచ్ఛాపురం మార్గాల్లో మహిళలు అధికంగా ప్రయాణిస్తున్నారు. గతంలో జిల్లాకు ఆక్యుపెన్సీ రేటు 72శాతం మాత్రమే ఉండగా ఇప్పుడు 93 శాతానికి పెరిగింద'ని తెలిపారు.



ఆర్టీసీ బస్సులో అధికంగా ప్రయాణిస్తున్న మహిళలు

వెలవెలబోతున్న ప్రైవేటు బస్సులు..


జిల్లాలో సుమారు 70 ప్రైవేటు బస్సులు తిరుగుతున్నాయి. పలాస నుంచి మెళియాపుట్టి మీదుగా సుమారు 15 ప్రైవేటు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. కాగా స్త్రీ శక్తి పథకంతో ఆర్టీసీ బస్సులన్నీ రద్దీగా ఉండగా.. ప్రైవేటు బస్సులు మాత్రం వెలవెలబోతున్నాయి. ఆర్టీసీ బస్సులు వెళ్లని రూట్లలో మాత్రమే ప్రైవేటు బస్సుల్లో కాస్త రద్దీ కనిపిస్తోంది. అధికంగా బరంపురం నుంచి పర్లాఖిమిండికి మాత్రమే ప్రైవేటు బస్సుల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

సరిహద్దుల్లో కష్టాలు..

జిల్లాలోని పాతపట్నం నియోజకవర్గంలో మూడు మండలాలు ఒడిశా రాష్ట్రం సరిహద్దున ఉన్నాయి. పలాస నుంచి మాతల, కొత్తూరు వరకు కొన్నేళ్ల నుంచి ఆర్టీసీ (మిగతా 6వ పేజీలో..)



ప్రయాణికులు లేక ఖాళీగా కనిపిస్తున్న టెక్కలి- మెళియాపుట్టి వెళ్లే ప్రైవేటు బస్సు



ఎంపీడీవో కార్యాలయం

ఈ సారు వారానికి ఒక్కసారే వస్తారు

- అధికార పార్టీ నేత పీఏనంటూ కారణాలు

సంతబొమ్మాళి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆయన డిప్యూటీ ఎంపీడీవో. వారంలో ఒకరోజే ఆఫీసుకు వస్తారు. సంతకాలన్నీ ఆరోజే చేస్తారు. ఎందుకని అడిగితే తాను ఓ అధికారపార్టీ ప్రజాప్రతినిధి పీఏగా వెళ్తున్నానని చెబుతున్నారు. అయితే అధికారికంగా ఈ ఉత్తర్వులు రాలేదు. కానీ పీఏ పేరిట విధులకు హాజరు కావడం లేదు. సంతబొమ్మాళి మండలంలో డిప్యూటీ ఎంపీడీవో పద్మజ ఇటీవల బదిలీపై లావేరు మండలానికి వెళ్లిపోయారు. ఆమె స్థానంలో పాతపట్నం నుంచి వెంకటరావు డిప్యూటీ ఎంపీడీవోగా విధుల్లో చేరారు. ఆయన దురుసుగా ప్రవర్తిస్తున్నారని పంచాయతీ కార్యదర్శులంతా ఆరోపించగా.. 15 రోజుల్లో మళ్లీ బదిలీపై ఇచ్ఛాపురం వెళ్లిపోయారు. దీంతో పదోన్నతిపై యు.సత్యనారాయణ డిప్యూటీ ఎంపీడీవోగా జూలై 15న సంతబొమ్మాళిలో చేరారు. కానీ ఆయన సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు. వారానికి ఒక్కసారి వచ్చి.. హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని కొంతమంది సిబ్బంది చెబుతున్నారు. బుధవారం మండలంలోని ఇజ్జవరంలో ఆర్.ఆర్.కాలనీకి సంబంధించి విచారణకు డిప్యూటీ ఎంపీడీవో హాజరై.. మండల పరిషత్ హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెంటనే వెళ్లిపోయారని పేర్కొంటున్నారు. 'జిల్లాలోని అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి వద్ద పీఏగా పనిచేస్తున్నాను. త్వరలోనే డిప్యుటేషన్‌పై వెళ్లిపోతాను' అని చెప్పి మండల పరిషత్‌లో రోజువారీ విధులకు గైర్హాజరవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ అండదండలు ఉండడంతో మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఆయన విషయంలో తమకెందుకులే అన్న చందంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

● కార్యాలయంలో (మిగతా 6వ పేజీలో..)

అవినీతికి పాల్పడితే వేటు తప్పదు

- శిక్షల శాతం పెరిగేలా కేసులు దర్యాప్తు చేయాలి: డీఐజీ గోపినాథ్‌జెట్టి

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): 'విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన పోలీసు అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవ'ని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్‌జెట్టి స్పష్టం చేశారు. నిష్పక్షపాతంగా కేసులు దర్యాప్తు చేయాలని, మహిళలకు భద్రత కల్పించాలని, బాధితులకు న్యాయం అందించేలా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష, సమన్వయ సమీక్ష సమావేశానికి డీఐజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్‌మౌలానా విశిష్ట అతిథులుగా వచ్చారు. డీఐజీ గోపినాథ్‌జెట్టి మాట్లాడుతూ.. 'జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలి. శిక్షల శాతం పెరిగేలా సాంకేతిక శాస్త్రీయ కోణంలో కేసులు దర్యాప్తు చేయాలి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పద'ని హెచ్చరించారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ 'ప్రతీ శనివారం పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలను పోలీసులతోపాటు బాలబాలికలు, సంరక్షణ, చైల్డ్‌లైన్, రెవెన్యూ, హెల్త్, మెడికల్, విద్య, ఇతర విభాగాలు అధికారులు పరిశీలించాలి. విద్యార్థులతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాలు, కిడ్నాప్, ఈవ్‌టీజింగ్ వంటివాటిపై జాగ్రత్తలు చెప్పాలి. మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలు, పోక్సో వంటి చట్టాలు, డయల్ 112, 1091, 1098, 181, 1930, 1972, శక్తియాప్‌పై అవగాహన కల్పించాల'ని (మిగతా 6వ పేజీలో..)



సమావేశంలో డీఐజీ గోపినాథ్‌జెట్టి, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా



గొట్టాబ్యారేజీ నుంచి వృథాగా పోతున్న నీరు

వంశధార - బాహుదా

అనుసంధానం లేనట్టే!

- ఐదేళ్లు నీరుగార్చిన వైసీపీ ప్రభుత్వం
- ఏటా సముద్రంలోకి వృథాగా పోతున్న నీరు
- పెరిగిన అంచనా వ్యయం

టెక్కలి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వంశధార, బాహుదా నదుల అనుసంధానం కలగానే మిగులుతోంది. గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారింది. హిరమండలంలోని గొట్టాబ్యారేజీ నుంచి నీరు వృథాగా సముద్రంలోకి పోతోంది. వంశధార నది నుంచి సుమారు 97.262 టీఎంసీలను బాహుదాకు మళ్లించాలని టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014- 19) సీఎం చంద్రబాబునాయుడు భావించారు. వంశధార, బాహుదా నదులను అనుసంధానం చేసి.. సుమారు 1.50లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. 2018లో అప్పటి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సర్వే చేశారు. రూ.5కోట్ల నిధులు మంజూరు చేయగా, నీటిపారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం ప్రారంభించారు. అందులో భాగంగా 2019 మార్చిలో వంశధార, బాహుదా నదుల అనుసంధానానికి టీడీపీ ప్రభుత్వం రూ.6,400కోట్లకు ఆమోదం తెలిపింది. బెంగుళూరుకు చెందిన బీఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ టెండర్లను సైతం దక్కించుకుంది. కొద్దిరోజుల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పనులకు బ్రేకులు పడ్డాయి.

వైసీపీ పాలనలో..

2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

ఎరువుల కొరత లేదు

- ఇబ్బందులుంటే ఒక్క ఫోన్‌తో పరిష్కారం
- అక్రమాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఎరువుల పంపిణీపై పర్యవేక్షణ కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ **91218 63788** ఏర్పాటు చేశాం. ఎరువుల సరఫరాలో ఎటువంటి సమస్యలున్నా ఈ నెంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ మెసేజ్ చేస్తే తక్షణ చర్యలు (మిగతా 6వ పేజీలో..)

ఊక పడి.. ఊపిరాడక..

- మడపాం పేపర్‌మిల్లులో ప్రమాదం
- కార్మికుడి మృతి
- న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన

నరసన్నపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలం మడపాం టోల్‌ప్లాజా వద్ద వంశధార పేపర్‌మిల్లులో శుక్రవారం జరిగిన ప్రమాదంలో మడపాం గ్రామానికి చెందిన ఉంగటి వాసుదేవరావు (46) మృతి చెందారు. పేపర్‌మిల్లు వద్ద కార్మికులు, మృతుడి కుటంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాసుదేవరావు ఊక కన్వేరు వద్ద ఊకను మిషన్‌లో వేస్తున్న సమయంలో ఊక మొత్తం ఆయనపై పడటంతో ఊపిరిరాడక మృతిచెందారు. ఊక కన్వేరు వద్ద మిషన్‌లో వేసే సమయంలో కార్మికులకు భద్రత పరంగా ఏర్పాట్లు చేయకపోవడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. సమాచారం తెలుసుకుని మృతుడి భార్య విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు, బంధువులు విలపించారు. యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ ఆవరణలో మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని, పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పేపర్‌మిల్లులో ప్రమాదంపై సమాచారం అందుకున్న నరసన్నపేట పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. వాసుదేవరావు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.



వాసుదేవరావు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

వామ్మో.. ఇవి రోడ్లేనా?

- అధ్వానంగా కూర్మ, నేరడి, పోతులూరు గ్రామాల రహదారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ప్రయోజనాలెన్నో

- నానోలో రసాయన ఎరువుల కంటే మెండుగా పోషకాలు
- అధిక దిగుబడులకు దోహదం

6లో

తవ్వి వదిలేశారు

- రాళ్లు తేలిన రోడ్లు
- నెలలు గడుస్తున్నా పనుల్లేవ్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు

7లో

ఇంత నిర్లక్ష్యమా?

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- ట్రాన్స్‌కో అధికారుల తీరుపై మండిపాటు

8లో



ఆక్రమణకు గురైన సీతన్న చెరువు

చెరువును కప్పేస్తున్నారు

- దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు
- రైతులకు సాగునీటి ఇబ్బందులు

కోటబొమ్మాళి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు సాగునీరందిస్తున్న చెరువులను అక్రమార్కులు దర్జాగా కప్పేసి.. ఆక్రమించుకుంటున్నారు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 237/2లో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చిన్నాన్నకర్ర చెరువు కబ్జాకు గురైన విషయం తెలిసింది. తాజాగా కోటబొమ్మాళి పంచాయతీ సీతన్నపేట గ్రామంలో ఆర్అండ్‌బీ(కోటబొమ్మాళి - సంతబొమ్మాళి) రహదారికి ఆనుకుని ఉన్న సీతన్నచెరువును ఆక్రమణదారులు మట్టితో కప్పేస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతులు తమకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువుపై ఆధారపడి సుమారు 200 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. రోడ్డు పక్కనే చెరువు ఉండడంతో వాహనదారులకు, పశువులకు కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. కాగా ఇప్పటికే ఆలయ నిర్మాణం పేరిట ఈ చెరువులో కొంతభాగాన్ని కప్పేశారు. ప్రస్తుతం మరికొంత భాగంలో దుకాణాల ఏర్పాటుకుగానూ కొంతమంది మట్టిని వేసి కప్పేస్తున్నారు. ఇలా అయితే తమ పొలాలకు ఎలా సాగునీరు అందుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి ఈ చెరువును కాపాడాలని కోరుతున్నారు.

● ఈ విషయమై తహసీల్దార్ ఆర్.అప్పలరాజు వద్ద ప్రస్తావించగా.. చెరువు ఆక్రమణ విషయం తమ దృష్టికి రాలేదన్నారు. ఎవరైనా చెరువును ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రయోజనాలెన్నో

నానో ఎరువులు



- నానోలో రసాయన ఎరువుల కంటే మెండుగా పోషకాలు
- అధిక దిగుబడులు సాధించేందుకు దోహదం
- వినియోగిస్తే మంచిదంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు
- రైతులకు కొరవడిన అవగాహన

టెక్కలి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో గతంలో ఎప్పుడు లేనంతగా ఈ ఏడాది యూరియా కొరత తీవ్రంగా ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి నానో యూరియా వినియోగించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రసాయన యూరియా నీటి కాలుష్యానికి, పర్యావరణానికి హాని చేస్తుందని, ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారనే ఉద్దేశంతో వాటి వాడకం తగ్గించాలని కేంద్రప్రభుత్వం గతంలో చెప్పింది. రసాయన యూరియాకు బదులు ద్రవ రూపంలో ఉండే నానో యూరియా, డీఏపీని వినియోగించాలని చెప్పింది. పంటలకు పోషకాలు అందించడంలో రసాయన ఎరువులకు ధీటుగా నానో ఎరువులు పనిచేస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఈ ఏడాది సుమారు 4,47,382 ఎకరాల్లో వరి సాగు అవుతుంది. ఇతర పంటలు మరో 2 లక్షల ఎకరాల వరకు సాగులో ఉన్నాయి. ఈ ఏడాది అధికారులు మార్క్‌ఫెడ్ ద్వారా మొదటి విడతగా యూరియా 5,692 మెట్రిక్ టన్నులు, డీఏపీ 215 మెట్రిక్ టన్నులు రైతులకు అందించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా 10,532 మెట్రిక్ టన్నులు, డీఏపీ 384, సూపర్‌పాస్ఫేట్ 842 మెట్రిక్ టన్నులు అందించారు. హోల్‌సేల్ దుకాణాల వద్ద మరో 29,382 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులు కొనుగోలు చేశారు. అయితే రైతులు ఎకరానికి సగటున 160 కిలోల యూరియా వాడాలి. కానీ 400 నుంచి 500 కిలోలు వినియోగిస్తున్నారు. దీనివల్ల యూరియా కొరత ఏర్పడింది. మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం వల్ల పంటలు తెగుళ్ల బారినపడుతున్నట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

నానోపై అవగాహన లేక..

నానో యూరియాతో కలిగే ప్రయోజనాలపై అవగాహన లేక రైతులు దాన్ని వినియోగించడం లేదు. నానో యూరియా మొక్కలకు పోషకాలు సమర్థంగా అందిస్తుందని, అధిక దిగుబడులు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నేలకు, పంటకు మేలు చేస్తాయని, పర్యావరణాన్ని కాపాడేందుకు దోహదపడుతుందని అంటున్నారు. రసాయన యూరియాలో 30-40% పోషకాలు ఉంటే నానో యూరియాలో 80-90% ఉంటాయని చెబుతున్నారు. రైతులు రసాయన ఎరువులు తగ్గించి, నానో యూరియా వాడితే మంచిదని సూచిస్తున్నారు. రైతుసేవా కేంద్రాల్లో 45 కిలోల రసాయన యూరియా బస్తా రూ.275కు రైతులకు అందించారు. ప్రైవేట్ వ్యాపారులు రూ.350 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు. నానో యూరియా 500 మి.లీ డబ్బా రూ.225కే దొరుకుతుంది. రసాయన డీఏపీ బస్తా రూ.1400, నానో డీఏపీ 500 మి.లీ రూ.600కే లభ్యమవుతుంది. ఎకరానికి అర లీటరు నానో యూరియా, డీఏపీ ద్రావణం సరిపోతుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

నానో ఎరువుల వినియోగింపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయన యూరియా, డీఏపీని మోతాదుకు మించి వాడటం వల్ల పంటలకు తెగుళ్ల సోకుతున్నాయి. వీటి నివారణకు రైతులు మళ్లీ పురుగు మందులు వినియోగిస్తున్నారు. దీనివల్ల పంట నాణ్యత దెబ్బతినడంతో పాటు రైతులు కూడా అనార్యోగానికి గురవుతున్నారు. నానో యూరియా వాడితే మంచి దిగుబడులు వస్తున్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. అందువల్ల రైతులు అపోహలు వీడి నానో ఎరువులు వినియోగించాలి.

-కె.జగన్‌మోహనరావు, ఏడీ, టెక్కలి

ఈ సారు వారానికి ఒక్కసారే వస్తారు

(ఐదో పేజీ తరువాయి)

పనులు చక్కబెట్టేందుకు ఆరికవలస పంచాయతీ కార్యదర్శి సిద్దార్థ.. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల సంతబొమ్మాళి మండలంలో బోరుభద్ర, ఉమిలాడ, తాళ్లవలసలోని ఉపాధిహామీ, వెలుగు పనులను కేంద్ర ఎన్‌ఎల్‌ఎం బృందం పరిశీలించింది. ఆ సమయంలో కూడా డిప్యూటీ ఎంపీడీవోగా సిద్దార్థ హాజరయ్యారు. ఈ విషయమై ఎంపీడీవో జయంత్ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. 'డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ జిల్లాలో ఓ రాజకీయ నాయకుడి వద్ద పీఏగా డిప్యుటేషన్‌పై వెళ్లిపోతున్నానని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో ఫైల్ పెండింగ్‌లో ఉందంటున్నారు. అందువల్ల డిప్యూటీ ఎంపీ డీవో వ్యవహారాల కోసం పంచాయతీ కార్యదర్శి సిద్దార్థను ఇన్‌చార్జిగా నియమించాం. అప్పుడప్పుడూ డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ విధులకు వచ్చి వెళ్తున్నారని తెలిపారు.

'స్త్రీ శక్తి'కి ఆదరణ

(ఐదో పేజీ తరువాయి)

సర్వీసులు నడుస్తున్నాయి. అయితే ఒడిశా రాష్ట్రం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. దీంతో అక్కడ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికంగా శ్రీకాకుళం నుంచి పాతపట్నం మీదుగా రాయఘడ, పర్లాఖిమిండి తదితర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతున్నారు. వీటిలో సైతం మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం లేక ఆందోళన చెందుతున్నారు. దీంతో కొంతమంది మహిళలు ఆంధ్రా సరిహద్దు వరకు ఉచితంగా ప్రయాణించి.. అక్కడి నుంచి టికెట్ డబ్బులు చెల్లించి ప్రయాణం సాగిస్తున్నారు.

- ఆర్టీసీ బస్సుల్లో రద్దీ నేపథ్యంలో కొన్నిసార్లు సీట్ల కోసం మహిళల మధ్య స్వల్ప తగాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అలాగే మహిళల ఉచిత ప్రయాణానికి ఆధార్ జిరాక్స్ కాపీలను కూడా అనుమతించాలని ఇటీవల ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు స్పష్టం చేశారు. కానీ, చాలామంది కండక్టర్లు ఆధార్‌కార్డులు ఒరిజినల్ ఉండాలని పట్టుబడుతున్నారు. జిరాక్స్‌లను చూపిస్తే.. అంగీకరించడం లేదు. ఈ క్రమంలో కండక్టర్, మహిళా ప్రయాణికుల మధ్య వాదనలు జరుగుతున్నాయి. ఇటువంటి సమస్యలను పరిష్కరించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.
- ఈ విషయమై టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. 'ఆర్టీసీ బస్సుల్లో రోజురోజుకీ మహిళా ప్రయాణికులు పెరుగుతున్నారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా అధికంగా ప్రయాణికులు వెళ్లే రూట్లను గుర్తించి బస్సులను నడుపుతున్నామ'ని తెలిపారు.



ఎస్పీ మహేశ్వరరెడ్డికి సూచనలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

శిక్షణ కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

- డీఐజీ గోపీనాథ్ జెట్టి

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): పోలీసు శిక్షణ కేంద్రం పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. తండేంవలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. కానిస్టేబుల్ నియామకాల్లో ఎంపికైన స్టైఫెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో వారికి అవసరమైన సౌకర్యాలు, మౌలిక వసతులు, భద్రతా చర్యలను పరిశీలించారు. బ్యారక్స్, తరగతి గదులు, వంటగది, భోజనశాల, స్నానపు గదులు, వైద్య గది, పరేడ్ గ్రౌండ్, రన్నింగ్ ట్రాక్, కంప్యూటర్ గదులను సమీక్షించి, లోపాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్, ఇతర శిక్షణలకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, శేషాద్రి, ప్రసాదరావు, సీఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.



వైద్యఆరోగ్య శాఖాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మాతా, శిశు మరణాలు లేకుండా చర్యలు తీసుకోవాలి

- లింగ నిర్ధారణ పరీక్షలపై ప్రత్యేక నిఘా
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా, శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేలా విస్తృతంగా ప్రచారం చేయాలని, అవగాహన కార్యక్రమాలు చేపట్టాన్నారు. మాకివలస, గుత్తావిల్లి, చొర్లంగి, గోవిందపురం, నిమ్మాడ, బైదలాపురం పీహెచ్‌సీల్లో చోటుచేసుకున్న శిశు మరణాలపై ఎండీఎస్‌ఆర్, సీడీఎస్‌ఆర్ కమిటీలతో సమీక్షించారు. ఈ మరణాలకు దారితీసిన కారణాలపై చర్చించి, ఇకపై క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గర్భిణులకు తప్పనిసరిగా హిమోగ్లోబిన్, బీపీ, ఇతర ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. స్కాన్ రిపోర్టులను జనరల్ ఫిజీషియన్‌ల వద్ద చూపించి, వారి సూచనలు తీసుకుని, అందుకు అనుగుణంగా క్రమం తప్పకుండా సేవలందించాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసే ఆసుపత్రులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భ్రూణ హత్యలు ఎట్టి పరిస్థితుల్లోను జరగడానికి వీల్లేదని, ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది పనివేళల్లో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత, డీసీహెచ్‌ఎస్ ఎన్.శైలజ, డీఐవో డా.రాందాస్, డెమో వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వంశధార - బాహుదా అనుసంధానం లేనట్టే!

(ఐదో పేజీ తరువాయి)

సాగునీటి ప్రాజెక్టులకు కనీసస్థాయిలో నిధులు విడుదల చేయలేదు. సరికదా.. టీడీపీ ప్రభుత్వ హయాంలో 25శాతం లోపల జరిగిన కాంట్రాక్ట్ పనులన్నీ రద్దుచేసింది. దీంతో వంశధార, బాహుదా నదుల అనుసంధానానికి శాపంగా మారింది. ప్రస్తుతం ఈ నదులు అనుసంధానం చేయాలంటే బడ్జెట్ సుమారు రూ.12 వేల కోట్ల అంచనాకు చేరుకుంది. కూటమి ప్రభుత్వం ఆ స్థాయిలో నిధులు కేటాయించడానికి సముఖంగా లేకపోవడంతో ప్రజాప్రతినిధులు ఎవరూ నోరుమెదపని పరిస్థితి నెలకొంది. సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు నీటిపారుదల శాఖ సీఈ ఈ అంశాన్ని ప్రస్తావించినప్పటికీ నిధులు సమస్య మూలంగా పక్కన పెట్టారు. మరోవైపు ఒడిశాలోని బగల్‌హతి డ్యామ్ నుంచి 1.5టీఎంసీల నీరు అంతరాష్ట్ర నదుల సర్దుబాటు లెక్కల ప్రకారం ఆంధ్రాకు రావాల్సి ఉన్నా ఒడిశా ప్రభుత్వం వర్షాలు పడితే తప్ప కిందకు నీరు విడిచిపెట్టదు. ఇక బాహుదా నదికి ఎగువ వర్షాలు పడితే తప్ప సాగునీరు అంతంతమాత్రంగానే చెప్పవచ్చు.

- అప్పట్లో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు వంశధారకు సంబంధించి హిరమండలం రిజర్వాయర్ దగ్గర ఆఫ్‌టెక్స్ స్లూయిస్ నిర్మాణం ప్రారంభించి 60 కాన్టూర్ వయా హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి, మందస, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం సమీపంలో బాహుదా నది వరకు నీటిని మరల్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం వంశధారలో ఏడాదికి సుమారుగా 97.262టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి పోతుంది. 2019-20 సంవత్సరంలో 135.866టీఎంసీలు, 2020-21లో 73.187టీఎంసీలు, 2021-22లో 53.921 టీఎంసీలు, 2022-23లో 124.186టీఎంసీలు, 2023-24లో 51.134 టీఎంసీలు, 2024-25 మే నెల వరకు 44.858టీఎంసీల నీరు వంశధార నుంచి సముద్రంలోకి వృథాగా పోయినట్లు నీటిపారుదల శాఖ అధికారులు లెక్కలు కట్టారు. అలా వృథాగా పోయే నీటిని ఈ రెండు నదులు అనుసంధానం చేస్తే ఎనిమిది మండలాల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. కూటమి ప్రభుత్వం స్పందించి వంశధార, బాహుదా నదుల అనుసంధానంపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై వంశధార ఈఈ బి.శేఖరరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా తాజాగా ఎటువంటి ప్రతిపాదనలు చేపట్టలేదని తెలిపారు.

ఎరువుల కొరత లేదు

(ఐదో పేజీ తరువాయి)

తీసుకుంటాం. వీఏఏల ద్వారా కానీ, సచివాలయంలో కూడా ఫిర్యాదు చేయొచ్చు. ఖరీఫ్‌లో జిల్లాలో 3,37,300 ఎకరాల్లో వరి సాగవుతోంది. దీనికి 17వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేశాం. అయినా ఇప్పటివరకు రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 10,244 మెట్రిక్ టన్నులు, అలాగే ప్రైవేటు డీలర్ల ద్వారా 11,400 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశాం. అంచనాలకు మించి అందించాం. ప్రస్తుతం జిల్లాలో 1031 టన్నుల యూరియా అందుబాటులో ఉంది. వారం రోజుల్లో జిల్లాకు మరో 3,200 టన్నుల ఎరువులు రానున్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. రబీ సీజన్‌కు ఇప్పటి నుంచే ఎరువులను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం లేదు. పూర్తిస్థాయి సరఫరాకు చర్యలు తీసుకున్నాం. ఎరువుల నిల్వలపై రోజూ రెవెన్యూ, విజిలెన్స్ విభాగాల సహకారంతో తనిఖీలు చేపడుతున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారి లైసెన్సు రద్దు చేసి, షాపు సీజ్ చేసి కఠినచర్యలు తీసుకుంటాం. నానో యూరియా కూడా అందుబాటులో ఉంది. అరలీటరు కేవలం రూ.220 మాత్రమే. ఇది ఒక యూరియా బస్తాకు సమానం. దీనిని డ్రోన్ల ద్వారా, లేదా స్ప్రేయర్ల ద్వారా వినియోగించుకోవచ్చు. నానో యూరియా వినియోగం, దాని ద్వారా పొందే అధిక లాభాలను రైతులకు అవగాహన కల్పిస్తామ'ని కలెక్టర్ తెలిపారు.

విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ప్రతిపాదనలు

- జెన్‌కో ఎండీ చక్రధరరావు

కొత్తూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద రూ.32 వేల కోట్లతో విద్యుత్ కేంద్రం నిర్మాణంపై ప్రభుత్వానికి ప్రతి పాదన పంపించినట్టు జెన్కో ఎండీ చక్రధరరావు తెలిపారు. శ్రీకాకుళం జేసీగా పనిచేసిన సమయంలో వంశధార నిర్వాసితులపై ప్రభుత్వం పెట్టిన కేసు విషయమై శుక్రవారం కొత్తూరు కోర్టుకు వచ్చిన ఆయన అనంతరం మాట్లాడారు. వెన్నెలవలస వద్ద విద్యుత్ కేంద్రం నెలకొల్పేందుకు సుమారు రెండు వేల ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. విద్యుత్ కేంద్రం నెలకొల్పడం వల్ల వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కొత్తూరు మండలంలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎల్.తులసీవర ప్రసాద్‌రావు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.



ఏపీ జెన్‌కో ఎండీకి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ఆదిత్యుని సన్నిధిలో..

అరసవల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదం, చిత్ర పటాన్ని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.వెంకటరమణ అందజేశారు. ఆర్డీవో సాయి ప్రత్యూష ఉన్నారు.

అవినీతికి పాల్పడితే వేటు తప్పదు

(ఐదో పేజీ తరువాయి)

తెలిపారు. జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్‌మౌలానా మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో ఎదురయ్యే లీగల్ సమస్యలు, నేరప్రవృత్తి అంశాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో చర్చించాలి. నూతన చట్టాలపై అవగాహన అవసరమ'ణి తెలిపారు.

- ముందుగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. గత ఆరు నెలల్లో జిల్లాలో నమోదైన కేసులు, దర్యాప్తులో సాధించిన పురోగతి, నేరనియంత్రణ.. తదితర చర్యలపై డీఐజీకి వివరించారు. పటిష్ఠ చర్యలతో నేరాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏఎస్పీలు కె.వి.రమణ, పి. శ్రీనివాసరావు, టౌన్ డీఎస్పీ వివేకానంద, ఎస్ఈ సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు పాల్గొన్నారు.

వామ్మో.. ఇవి రోడ్లేనా?

నేరడి వద్ద బురదమయంగా..

కొత్తూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం నేరడి గ్రామానికి వెళ్లే రహదారి గోతులమయమై బరదగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ఫ్లడ్ ఫో కేనాల్ నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రహదారి వరకు పెద్ద పెద్ద గోతులై బురదతో ఉండడంతో వాహనాలు కూరుకిపోతున్నాయి. ఇక గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం చేస్తే అంబులెన్స్ రావాలన్నా అష్టకష్టాలు పడాల్సి వస్తుందని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రహదారిలో గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



గుంతలమయమైన కూర్మ గ్రామానికి వెళ్లే రోడ్డు

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని చాలా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వాహనాల రాకపోకల సంగతి అటుంచితే కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలులేని పరిస్థితి ఆయా రోడ్లలో నెలకొంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

కూర్మ గ్రామ రోడ్డు..

హిరమండలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంతో కీలకమైన నౌతల-శ్రీముఖలింగం రహదారి నుంచి కిట్టాలపాడు మీదు గా కూర్మ గ్రామాలకు వెళ్లే రోడ్డులో భారీ గుంతలు ఏర్పడి కనీసం నడిచి వెళ్లలేని పరి స్థితి నెలకొంది. అడుగడుగునా గుంతలు ఏర్ప డి రాళ్లు తేలడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పెద్ద గుంతలు కావ డంతో ఒక్కోసారి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన వైదిక గ్రామం కూర్మ వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. నిత్యమూ ఈ గ్రామాన్ని సందర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రహదారి దుస్థితితో వారంతా ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా పోతులూరు రహదారి..

నందిగాం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నందిగాం నుంచి చిన్నతామరాపల్లి వెళ్లే రోడ్డులో పోతులూరు గ్రామం వద్ద అధ్వానంగా మారింది. వర్షపునీటితో పాటు మురుగు రహదారిపై నిలిచిపోతుండడంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పోతులూరు మెయిన్‌వీధితో పాటు బెజ్జిపల్లి వీధిలోను బురదమయంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులు చేపట్టాలని ఆయా గ్రామాలకు చెందిన టి.భుజంగరావు, టి.నాగయ్య, కె.నర్సింహులు, జి.బాలకృష్ణ కోరారు.



బురదమయంగా మారిన నేరడి రోడ్డు



పోతులూరు వద్ద రోడ్డు దుస్థితి

సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే శంకర్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ-ఏ కాలనీలోని తన కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, రానున్న కాలంలో మరింత అభివృద్ధిని చూస్తారని తెలిపారు.

దేవీ ఆశ్రమంలో సహస్ర కలశాభిషేకం



అమ్మవారిని దర్శించుకుంటున్న శ్రీరామానంద భారతి స్వామి

ఎచ్చెర్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కుంచాలకురమయ్యపేట దేవీ ఆశ్రమంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరి దేవికి సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. శ్రీరామానందభారతి స్వామి దేవీ ఆశ్రమాన్ని సందర్శించి అభిషేకం, పూజలను చేపట్టారు. ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ చక్రాల వద్ద భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో అరసవల్లి ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ, రుత్వికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవికుమార్‌కు సంఘీభావం

ఆమదాలవలస, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌పై కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య చేసిన ఆరోపణలు నిరాధారమని విజయనగరం జిల్లా కాళింగ సంఘం అధ్యక్షుడు పేడాడ జనార్దనరావు అన్నారు. శుక్రవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో ఆయన రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. గడిచిన 30 ఏళ్లుగా ఎటువంటి ఆరోపణలు లేకుండా నీతి, నిజాయతీతో ప్రజాసేవ చేస్తున్న రవికుమార్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా సౌమ్య ఆరోపణలు చేయడం దారుణమని వీటిని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ కంచరాన మురళీధర్, సనపల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

దళితజాతి తలదించుకునేలా సౌమ్య ఆరోపణలు

పొందూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య చేసిన ఆరోపణలు దళితజాతి తలదించుకునేలా ఉన్నాయని దళిత నాయకుడు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, జిల్లా దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు, బీజేపీ నేత సాకేటి నాగరాజు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు కుమిలి రాజేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌పై ఆమె చేసిన ఆరోపణలను ఖండించారు. వాస్తవానికి ఆమె మతం మార్చుకున్నారని, దళిత పదం వాడే హక్కు లేదన్నారు. తక్షణం ఆమెపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసు కోవాలన్నారు. సమావేశంలో మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చందక ఆది, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా భరతమాత ఆలయ వార్షికోత్సవం



కవిటి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కపాసుకుద్ది భారతమాత ఆలయ వార్షికోత్సవం శుక్ర వారం ఘనంగా నిర్వ హించారు. అమ్మవారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజ లు చేశారు. భారత మాత యువతన సంఘం ఆధ్వర్యంలో నిరంజన్ స్వామి ఆధ్వర్యంలో 108 మంది మహిళలు కుంకుమ పూజలు చేపట్టారు. మావుడూరు సత్యనారాయణ శర్మ వయోలిన్ శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించారు.

27 నుంచి సాహిత్య గణపతి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్ ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న ఉపనిషన్మందిరంలో ఈనెల 27 నుంచి వినాయక నవరాత్రుల సందర్భంగా సాహిత్య గణపతి ఉత్సవాలు నిర్వ హిస్తున్నట్లు ఉపనిషన్మందిరం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 27న భాస్కర భట్ల శ్రీరామశర్మ శ్యమంతకోపాఖ్యానం పురాణ ప్రవచనం చేస్తారన్నారు. ఇందులోభాగంగా 28 నుంచి సెప్టెంబరు 14 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అవధాని పైడి హరినాథ్ హంపీక్షేత్రం, పి.శాంతమ్మ శతక రచన వైశిష్ట్యం, పొందూరు సుధాకుమార్ కాశీఖండం గుణనిధి వృత్తాంతం, బమిడిపాటి గౌరీశంకర్ లలితా త్రిశతి వృత్తాంతం, ఎ.శ్రీరామమూర్తి నాటకాస్త్ర సాహిత్యం, వి.నాగేంద్ర 'అల్లసాని వారి అల్లిక' అంశాలపై ప్రసంగాలుంటాయన్నారు. అలాగే డాక్టర్ కోమలరావు కవికర్ణ రసాయనం, రామకృష్ణ శర్మ ప్రబంధాల అవతరణ, పీవీఎస్ సాయిప్రసాద్ కుచేలోపాఖ్యానం, జంధ్యాల శరత్‌బాబు కరుణ శ్రీకారం, సనపల నారాయణమూర్తి మన కవి ఛాయారాజ్ వృత్తాంతం అంశాలపై ప్రసంగాలు ఉంటాయని, సాహిత్య, ఆధ్యాత్మిక ప్రియులు విచ్చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

తవ్వి వదిలేశారు

- రాళ్లు తేలిన రోడ్లు
- నెలలు గడుస్తున్నా పనుల్లేవ్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు



రాళ్లు తేలిన నక్కపేట రహదారి

జి.సిగడాం ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాలకు బీటీ రోడ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు రోడ్లను తవ్వారు. అయితే మిగిలిన పనులు చేపట్టకపోవడంతో రాళ్లతేలి వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా అదుపు తప్పి ప్రమాదాలబారిన పడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. రోడ్లను మంజూరు చేసి నెలలు గడుస్తున్నా నేటికీ పనులు పూర్తి చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంతవురిటి కూడలి-విజరాంపురం, సంతవురిటి కూడలి-సీతారాంపురం, టీడీవలస-నక్కపేట గ్రామా లకు వెళ్లాలంటేనే భయాందోళన చెందాల్సిన పరి స్థితి నెలకొంది. ఈ గ్రామాలకు బీటీ రోడ్లను నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఐదు నెలలైనా పనులు చేపట్టలేదు. దీంతో ఆయా మార్గా ల్లో ప్రయాణమంటేనే హడలెత్తుతు న్నారు ప్రజలు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణం పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





అసంపూర్తిగా ఉన్న విజరాంపురం, సీతారాంపురం రోడ్లు

25న జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్ ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్‌లో ఈనెల 25న అండర్-17 విభాగంలో జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా) ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పనిసరన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాకు కోచ్ జోగిపాటి వంశీ 76608 74844 నెంబరుకు సంప్రదించాలన్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'పైడి'



శ్రీకాకుళం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పైడి వేణుగోపాలం నియ మితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నూతన పదాధికారులను వెల్ల డించారు. జిల్లా నుంచి పైడి వేణుగోపాలాన్ని రెండోసారి ఉపాధ్యక్ష పదవి వరించింది. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు పర్యాయాలు రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించారు. మూడు పర్యాయాలు బార్ అధ్యక్షునిగా ఎన్నికైన ఈయన 2009లో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేశారు. పార్టీని క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి బలోపేతం చేస్తానని.. తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కళ్లేపల్లి గ్రామ పంచాయతీలో జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా శుక్రవారం దోమల నివారణకు ఏంటి లార్వా మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగు నరేంద్ర కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి జి.రవికుమార్, ఎంపీటీసీ రామకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ నిలుపుదల దారుణం

రణస్థలం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగుల పింఛన్లను నిలుపుదల చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ దివ్యాంగులు చాలా మంది పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోందని, వితంతువులు, 60 ఏళ్లు దాటిన వారికి నేటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయలేదన్నారు.

సద్గుణాలు అలవర్చుకోవాలి

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సద్గుణాలను అలవర్చుకోవాలని చిన్మయ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిద్రూపానంద స్వామి అన్నారు. స్థానిక బాపూజీ కళా మందిరంలో నిర్వహిస్తున్న జ్ఞాన ప్రవచన యజ్ఞం శుక్రవారం కొనసాగింది. కార్యక్రమంలో శ్రీకాకుళం శాఖ నిర్వాహకులు పరమాత్మానంద సరస్వతి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, నిక్కు అప్పన్న, అంధవరపు ప్రసాద్ పాల్గొన్నారు.

పట్టణాల పరిశుభ్రతే లక్ష్యం: ఎమ్మెల్యే రవికుమార్



పారిశుధ్య వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలను పరిశుభ్రంగా ఉంచాలన్నదే ప్రభుత్వ లక్ష్య మని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, పీ యూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ముని సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.45 లక్షలతో కొనుగోలు చేసి కంపాక్టర్ వాహనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ఒక్క ప్రభుత్వ లక్ష్యం మాత్రమేకాదని, ఇది ప్రతి పౌరుని బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తమ్మినేని రవి, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మునిసిపల్ మాజీ చైరపర్సన్ తమ్మినేని గీతాసాగర్, పీఏసీఎస్ అధ్యక్షుడు శిమ్మ మాధవి, టీడీపీ సీనియర్ నాయకులు మొదలవలస రమేష్, కణితి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

పురపాలక సంఘం కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పీఏసీఎస్, వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే రవికుమార్ నిర్వహించారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రైతులకు ఎరువుల పంపిణీపై వ్యవసా యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల కొరత ఉందని వారు తెలపడంతో వెంటనే జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో ఫోన్‌లో మాట్లాడి నియోజకవర్గానికి అదనపు ఎరువులను కేటాయించాలని కోరారు. ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జి ఎంఈవో కె.అప్పలరాములు శుక్రవారం ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

స్వామిత్వ సర్వే సక్రమంగా నిర్వహించాలి

- అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్



సర్వేను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్

గార రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను సక్రమంగా నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ ఆదేశించారు. రామచంద్రాపురం పంచాయతీలో జరుగుతున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ కంఠాలకు సంబంధించి ఇళ్లు, ఖాళీ స్థలాలకు సంబంధిత యజమానులకు శాశ్వత హక్కు ధ్రువపత్రాలను ప్రభుత్వం జారీ చేయ నున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఆరు పంచాయతీల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు డీపీవో భారతీ సౌజన్య, సర్వే అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా 28న ప్రతిజ్ఞ

అరసవల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈనెల 28న అమరవీరుల ప్రతి జ్ఞ దినం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.తులసీదాసు కోరారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టాలని యువగళం పాదయాత్రలో ఇప్పటి మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు బిగించడం మోసం కాదా అని ప్రశ్నించారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా అమరవీరుల ప్రతిజ్ఞ దినంలో పాల్గొనాలని కోరారు. కార్య క్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, నేతలు కె.మోహనరావు, బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు, ఎన్.షణ్ముఖరావు, అమ్మన్నాయుడు, ఎస్.లక్ష్మీనారాయణ, పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా భూసర్వే



శ్రీకూర్మంలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గార రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రెవెన్యూ గ్రామాల పరిధిలో శుక్రవారం సర్వే అధికారులు భూ సర్వే చేపట్టారు. ఈనెల 20న 'ఆంధ్రజ్యోతి'లో 'అధికారుల తప్పిదం.. రైతుల పాలిట శాపం' శీర్షికతో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. అంపోలు, శ్రీకూర్మం, తోణంగి, సతివాడ రెవెన్యూ గ్రామాల్లో సర్వే ప్రారంభించారు. సంబంధిత ప్రాంతాల్లో ఇటీవల డ్రోన్ సర్వే చేపట్టినప్పటికీ గతంలో జరిగే పొరపాట్లు జరగకూడదని బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వీఆర్వోలను రప్పించి భూ యజమానుల సమక్షంలో హద్దులు నిర్ణయించి రికార్డులను సక్రమంగా తయారు చేయనున్నట్లు సర్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పీఎంఎఫ్‌బీవైలో చేరాలి

పొందూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పొందూరు పీఏసీఎస్‌లో క్రాప్ లోన్ రెన్యువల్ చేసుకున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరాలని పీఏసీఎస్ అధ్యక్షుడు వండాన మురళి, సీఈవో పాపినాయుడు కోరారు. ఈ పథకంలో పంటలబీమాకు ఎకరాకు రూ.160 చెల్లించాలన్నారు. 1-బి, ఆధార్ కార్డుతో ఈ నెలాఖరులోగా పీఏసీఎస్‌లో సంప్రదించి నగదు చెల్లించాలన్నారు.

11, 12 తేదీల్లో కళాఉత్సవ్

గార రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) ప్రాంగణంలో కళా ఉత్సవ్ పోటీలను సెప్టెంబరు 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి టి.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, సంప్రదాయ కథ చెప్పడం, దృశ్య కళలు తదితర విభాగాల్లో ఈ పోటీలు వ్యక్తిగత, బృంద విభాగాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న బాలబాలికలు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు కార్యక్రమ నిర్వాహణ సహాయకుడు చలపాక రమణ 90007 26375, 77023 91639 నంబర్లలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

ఇచ్ఛాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రోత్సహించేందు కు ప్రతి ఏటా జేసీసాట్ స్కాలర్ షిప్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జేసీఐ అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ అన్నారు. శుక్రవారం ఈ పరీక్షలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జేసీఐ సభ్యులు స్నిగ్ధ, శిరీష, సంతోష్‌సాహు, షణ్ముఖ్, స్వరూప్, నవీన్‌పాల్గొన్నారు.

సముద్ర నాచు పెంపకంతో లాభాలు

సోంపేట రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సముద్ర నాచు పెంపకంలో అనేక రకాలా లాభాలు చేకూరుతాయని, దీనిపై మహిళలు ఆసక్తి పెంచుకొని ఆదాయం పొందాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ అన్నారు. మూలపొలం ఇంటిగ్రేటెడ్ కోస్టల్ ఆక్వా కల్చర్ ఫెసిలిటీ సెంటర్‌లో శుక్రవారం ఎస్‌హెచ్‌జీలతో సమావేశం నిర్వహించారు. రొయ్యలు, పీతలు, సముద్ర చేప పిల్లలు ఉత్పత్తితో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మత్స్యశాఖ డీడీ సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రమోహన్, మద్దు కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు M/s శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ... పలాస బ్రాంచి ... శ్రీమతి పొన్నపల్లి రాధా సాయి W/o పొన్నపల్లి వెంకటేశ్వరరావు ... పొన్నపల్లి సాయి నాగరాజు S/o పొన్నపల్లి వెంకటేశ్వరరావు ...

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED శ్రీకాకుళం బ్రాంచి ... శ్రీ/శ్రీమతి సర్వ రామారావు ... అప్పలస్వామి ... ఇచ్ఛాపురం ...

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s SHRIRAM FINANCE LIMITED ... నరసన్నపేట ...

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

శ్రావణ మాసం ఆఖరు శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు అభిషేకాలు, సామూహిక కుంకు మ పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తరించారు. -ఆంధ్రజ్యోతి బృందం



పొందూరు: పట్టు చీరలతో వరలక్ష్మి అమ్మవారు



గార: దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు



సోంపేట: కనకదుర్గమ్మ మొగలిపూలతో అలంకరణ




శ్రీకాకుళం కల్చరల్: బలగ కాలభైరవ స్వామి ఆలయంలో..



సరుబుజ్జిలి: మెట్టక్కివలస సత్యసాయి మందిరంలో..



నరసన్నపేట: మారుతీనగర్ సత్యసాయి మందిరంలో వరలక్ష్మి వ్రతాలు



టెక్కలి రూరల్: ఎండల మల్లికార్జున స్వామికి పూసిన హరిద్ర లేపనం







ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): భర్త అదృశ్యమయ్యాడని పేర్కొంటూ భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదుపై శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. నగరంలోని కుమ్మరవీధిలో నివసిస్తున్న వైశ్యరాజు మణికంఠ సిగరెట్లు లైన్ బిజినెస్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల కిందటే మణికంఠకు లక్ష్మీతో వివాహం జరిగింది. అయితే మణికంఠ ఇటీవల తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. ఆ అప్పు తీర్చేందుకు భార్య మెడలో ఉన్న నక్లెస్‌ను రూ.60 వేలకు తాకట్టు పెడతానని చెప్పి రూ.1.20 లక్షలకు తాకట్టు పెట్టాడు. ఇదే విషయమై భార్యా భర్తల మధ్య మూడు రోజులుగా వివాదం జరిగింది. గురువారం మణికంఠ ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మీ ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువులతో వ్యాను పట్టివేత



వ్యానులో ఉన్న గేదెలు

హరిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మందస మండలం కొర్రాయిగేటు ఓవర్ బ్రిడ్జి వద్ద 16 గేదెలతో వెళ్తున్న వ్యానును శుక్రవారం ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు సోంపేట వైపు నుంచి విశాఖ వెళ్తున్న ఈ వ్యాన్‌ను చూసి ఆపి ఆరా తీశారు. లోడును తనిఖీ చేయగా ఒకే వాహనంలో 16 గేదెలను ఎక్కించడంతో పోలీసులు అవాక్కయ్యారు. దీంతో డ్రైవరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం గేదెలను గోశాలకు తరలించారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

నరసన్నపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఏఈఆర్వో సత్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితా సవరణపై సమావేశం నిర్వహించారు. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన ఓటర్లను వెంటనే తొలగించాలని సూచించారు. బీఎల్‌వోలతో సమన్వయం చేసుకోవాలన్నారు. శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, ఆరంగి మురళి, జామి వెంకట్రావు, అడపా చంద్రశేఖర్, రాజాపు అప్పన్న, పూతిరమణ, బగ్గు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ పాలకవర్గం నియామకం

నరసన్నపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం సభ్యులను నియమిస్తూ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాలను జారీ చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్‌గా ఆలయ ధర్మకర్త పొట్నూరు చిన్నవీరభద్రస్వామి, సభ్యులుగా మావుడూరి జగదీష్, బోయన శ్రీదేవి, కూన గాయత్రి, దంతకూర్తి బాలకృష్ణ, లక్కోజి విశ్వనాథం, దుప్పలపూడి పద్మ, యారాగుల సుశీలను నియమించారు. ఈమేరకు సభ్యులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

కబడ్డీ పోటీలకు నౌపడ బాలికలు ఎంపిక

సంతబొమ్మాళి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 24నుండి 26 వరకు జరగనున్న అమరావతి కబడ్డీ చాంపియన్ షిప్ నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కె.వసుంధర, పి.హరిణి, కె.ధరణి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం ఎం.భానుప్రకాష్ తెలిపారు. విశాఖలో జరిగిన శాప్ పోటీల్లో విశాఖ జట్టును శ్రీకాకుళం జట్టు ఓడించిందని, ఇందులో కీలక పాత్ర పోషించిన నౌపడ పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పీఈటీలు ఎస్.జనార్దనరావు, డి.శ్యాంకాంతారావు అభినందించారు.

దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి

పాతపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో ఉన్న అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, అతడి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాతపట్నం అటవీ రేంజ్ పరిధిలోని అధికారులు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈ నెల 19వ తేదీ రాత్రి శ్రీశైలం శిఖరం చెక్‌పోస్టు వద్ద విధి నిర్వాహణలో ఉన్న అటవీశాఖ అధికారులపై దాడిని ఖండిస్తూ యూనిఫారాలపై నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక అటవీశాఖా కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో పాతపట్నం రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులం తనిఖీ చేసి డీసీవో


భోజన సరఫరాను పరిశీలిస్తున్న డీసీవో గ్రేస్

పాతపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలను గురుకులాల జిల్లా సమన్వయాధికారి (డీసీవో) జి.గ్రేస్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శన చేశారు. ఈ సందర్భంగా గురుకుల పరిసరాల పరిశుభ్రత, భోజన నిర్వాహణ పరిశీలించారు. అలాగే స్టోర్ రూం స్టాక్ తదితర వివరాలను రికార్డులను పరిశీలించారు. అలాగే తరగతి గదులను సందర్శించి బోధనా విధానాలను పరిశీలించారు. మెనూ నిర్వాహణ అమలుపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ పి.పద్మావతి, ఉపాధ్యాయలు, సిబ్బంది ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జలుమూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని ఆహ్లాదకరమైన వాతావరణం కలిగించాలని ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావులు అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను శుక్రవారం పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారికి ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు అందివ్వాలన్నారు. అలాగే వంటపాత్రలు ప్రతీ రోజు పరిశుభ్రం చేసి వేడి వేడి పదార్థాలను పిల్లలకు అందివ్వాలన్నారు. ప్రత్యేకాధికారి ఎ.యశోద, ఉపాధ్యాయులు సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- ట్రాన్స్‌కో అధికారుల తీరుపై మండిపాటు


వజ్రపుకొత్తూరు: బాతుపురం ఆర్అండ్‌బీ రహదారి పక్కనే..


హిరమండలం: అక్కరాపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద..

జిల్లాలోని ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో ఇలా విద్యుత్ స్తంభాలకు తీగ మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఈ తీగలు విద్యుత్ వైర్లను కప్పేస్తున్నా పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పొరపాటున ఆ విద్యుత్ స్తంభాలను తాకితే ప్రాణాపాయం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మూగజీవాలు అటుగా వెళ్తే ప్రమాదం తప్పదని భయ పడుతున్నారు. మరికొన్నిచోట్ల ట్రాన్స్‌ఫారాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిపో తున్నా పట్టించుకోవడంపై విమర్శ లు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిని తొలగించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.


పాతపట్నం: పట్టణ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న శాఖా గ్రంథాలయం సమీపంలో..

- పాతపట్నం/ వజ్రపుకొత్తూరు/ హిరమండలం

దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తాం

- ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే గౌతు శిరీష


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు తమ పింఛన్లు రద్దయ్యాయని ఆందోళన పడొద్దని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. తమ పింఛన్లు రద్దు చేశారని, పునరుద్ధరించాలని కోరుతూ పలువురు దివ్యాంగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ కలెక్టర్‌తో ఫోన్ మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే సక్రమంగా ఎరువులు అందడం లేదని రైతులు ఆమె దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడారు. మొత్తం 39 దరఖాస్తులు రాగా ఆయా శాఖల అధికారులకు వాటిని పంపించి పరిష్కరించాలని కోరారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తా

- పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరోగ్యకేంద్ర ప్రాంగణంలో పాలకకమిటీ సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేక భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పష్టం చేశారు. శుక్రవారం నిర్వహించిన పోలాకి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శిశు, మాతా మరణాలు లేకుండా చూడాలన్నారు. ఆరోగ్యకేంద్రంలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి బి.శ్రీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విస్తరణాధికారి నల్లి రవికుమార్, సర్పంచ్ మజ్జి రమణమ్మ, కూటమి నాయకులు ఎంవీ నాయుడు, బైరి భాస్కరరావు, గౌరునాయుడు, రాంబాబు, కిల్లి వేణుగోపాలరావు, వైద్యాధికారులు సుమప్రియ, బి.రజనీకాంత్, ఎంపీడీవో బలగ ప్రకాష్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా

నరసన్నపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరతంగా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా సూచించారు. శుక్రవారం జమ్ము జగనన్న లేవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. లేవుట్లలో శత శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఆరు లేవుట్లలో 527 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు పొదుపు సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు సీఈవోను కోరారు. ఎంపీడీవో వెంకటేష్ ప్రసాద్, గృహనిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే కోమర్తిలో ఐవీఆర్ఎష్ కాల్స్‌పై అవగాహన కల్పించారు.

మోతాదును మించి ఎరువులు వాడొద్దు

కోటబొమ్మాళి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వరి సాగు చేస్తున్న రైతులు పంటకు మోతాదుకి మించి ఎరువులు వాడొద్దని రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం వైద్యులు కె.మధుకుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి ఎత్తురాళ్లపాడులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పురుగు, తెగుళ్ల నివారణపై రైతులకు వివరించారు. నానో యూరియాను వాడాలని, పోటాష్‌ను రెండు సార్లు తప్పని సరిగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వై.సురేష్, ఏవో ఎస్.గోవిందరావు, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

రూపం కోల్పోయిన బీటీ రహదారి


మట్టి రోడ్డుగా మారిపోయిన దృశ్యం

నందిగాం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి తురకలకోట నుంచి మాదిగాపురం వెళ్లే బీటీ రహదారి రూపం కోల్పోయింది. తురకలకోట సమీపంలోని అడ్డుకొండ నుంచి గ్రావెల్ తరలిస్తుండడంతో వాహనాల రద్దీతో బీటీ రహదారి పోయి మట్టి రహదారిగా దర్శనమిస్తుంది.

డీలర్ల వివరాలు నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

జలుమూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రేషన్ డిపో డీలర్లు తప్పనిసరిగా తమ వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకోవాలని తహసీల్దారు జె.రామారావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాన్, ఆధార్‌కార్డులు తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వచ్చే నెల నుంచి నిత్యావసర సరుకులు స్మార్టు కార్డుల ద్వారా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ప్రతీ లబ్ధిదారు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. గొడౌము వద్ద వే బ్రిడ్జి ఏర్పాటు చేసినా అది పనిచేయడం లేదని, దీంతో సరుకుల తూకం లేక తరుగులు వస్తున్నాయని డీలర్లు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్ఐ కిరణ్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


డ్రోన్‌తో నానో ఎరువు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

జలుమూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు ఆధునిక సాంకేతికతపై అవగాహన కలిగి అందిపుచ్చుకోవాలని నరసన్నపేట వ్యవసాయశాఖ ఏడీ ఎల్‌వీ మధు తెలిపారు. చల్లవానిపేట గ్రామం పంచిరెడ్డి రామచంద్రరావు వరి పొలంలో నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు డ్రోన్ సాయంతో శుక్రవారం పిచికారి చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో సాంకేతికత విధానాలను అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చన్నారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడానికి నానో ఎరువులు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.రవికుమార్, వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు రీ-కేవైసీ చేయించాలి

పోలాకి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పదేళ్ల పైబడి బ్యాంక్‌లో తెరచిన ఖాతాదారులంతా వెంటనే రీకేవైసీ చేయించాలని డీసీసీబీ చీఫ్ మేనేజర్ ఐ.సీతారాం క్షేత్ర సహాయకులు మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం వారు పోలాకి సహకార సొసైటీలో కార్యాలయ సిబ్బంది, రీకేవైసీ చేయించాల్సిన ఖాతాదారులతో మాట్లాడారు. రీకేవైసీ చేయించేందుకు సుమారు 300 మంది ఖాతాదారులున్నారన్నారు. వారి వివరాలను సొసైటీ సీఈవోను అడిగితెలుసుకోవాలన్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రీకేవైసీ వెంటనే చేయించి ఖాతాను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. వారి వెంట సీఈవో బి.రాంబాబు, సొసైటీ చైర్మన్ బైరి భాస్కరరావు, పాలక సిబ్బంది తదితరులు ఉన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

పలాస, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ, రూరల్ ప్రాంతాల్లో వినాయకచవితి వేడుకలు బహిరంగంగా నిర్వహిస్తే పోలీసుల అనుమతులు తీసుకోవాలని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగల్‌విండో సిస్టం ద్వారా అనుమతులు లభిస్తాయని, ఆన్‌లైన్‌లో వీటిని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఉత్సవాన్ని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకాలన్నారు. ఊరేగింపుల్లో అశ్లీల నృత్యాలు, డీజేలు ఏర్పాటు చేయొద్దన్నారు.

- పాతపట్నం: పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. స్థానిక పోలీసు ఠాణాలో విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ.. దీనికై రూపొందించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎటు వంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.
- కోటబొమ్మాళి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ వంగపండు సత్యనారాయణ తెలిపారు. సింగిల్ విండో ద్వారా, ఎటువంటి రుసుం తీసుకోకుండా అనుమతులు మంజూరు చేస్తామన్నారు.

ప్రమాదమని తెలిసినా..


దెబ్బతిన్న కల్వర్టు రక్షణ గోడ

టెక్కలి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): టెక్కలి నుంచి తెంబూరు వెళ్లే రోడ్డులో గల గంగన్నాపేట వంతెన వద్ద కల్వర్టు గోడ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. గత రెండేళ్లగా ఇలాగే ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

పలాస, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఒకటో వార్డు నెమలి నారాయణపురం గ్రామంలో రూ.2 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ కాలువ పనులకు మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు శుక్రవారం శంకుస్థాపన చేసారు. అన్నీ వార్డుల్లోను సీసీ కాలువలు, రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మిస్తామన్నారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, అంబటి కృష్ణమూర్తి, యవ్వారి మోహనరావు పాల్గొన్నారు.

ఏపీఎంగా విజయకుమారి

ఎల్ఎన్ పేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయం ఏపీఎంగా విజయకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన రవిరాజ్ పాతపట్నం ఏపీఎంగా బదిలీపై వెల్లడంతో విజకుమారి ఎల్ఎన్ పేట నుంచి ఇక్కడకు వచ్చారు. మండలంలో మహిళా సంఘాల్లోని సభ్యులందరూ ఆర్థికంగా ఎదగాలంటే బ్యాంకుల్లో మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకులతో ఆర్థిక లావాలదేవీలను మెరుగుపరుకోవాలని మహిళ లందరూ ఆర్థికంగా నిలదొక్కుకొనేలా కృషి చేస్తానన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా గోవింద్

కోటబొమ్మాళి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు కోటబొమ్మాళి టీడీపీ పట్టణ అధ్యక్షుడుగా కోరాడ గోవింద్‌ను స్థానిక ఎన్టీఆర్ భవనంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఎన్నుకున్నారు. గత కొనేళ్లుగా టీడీపీకి ఎనలేని సేవలు అందించిన గోవింద్‌ను మంత్రి అచ్చెన్నాయుడు గుర్తించి ఈ పదవిని కట్టబెట్టారు. గోవింద్ నియామకంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, పార్టీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, పార్టీ నాయకులు పూజారి శైలజ, కర్రి అప్పారావు, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ తదితరులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారించాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి భుజంగరావు కోరారు. ఈ మేరకు నువ్వలరేవులో విలేకరులతో మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా బెండి, నగరంపల్లి, వజ్రపుకొత్తూరు కాంప్లెక్స్‌ల పరిధిలో పాఠశాలలో ఏపీటీఎఫ్ మండల బృందం పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి కె.నాగేశ్వరరావు, గున్న సుభాష్, శోభన్‌బాబు, సురేష్, ఉదయకుమార్, అనీల్, రమేష్ శ్రీనివాస్ చౌదరి ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కోటబొమ్మాళి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొత్తపేట గ్రామం ఇందిరమ్మ కాలనీకి చెందిన జగినికిల చిరంజీవి గత కొద్ది రోజులుగా క్యాన్సర్ వ్యాధిలో బాధపడుతుండడంతో ఆయనకు కొత్తపేట కోదండ అప్పల స్వామి వీధి వాసులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.13 వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన చిరంజీవి వైద్య ఖర్చులు కోసం ఇబ్బందులు పడుతున్నారని, దాతలు ముందుకు వచ్చి ఆయనకు ఆదుకోవాలని వారు కోరారు.

మరింత బాధ్యతగా పనిచేస్తా

మెళియాపుట్టి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మరింత బాధ్యతగా పని చేస్తానని మార్కెట్ కమిటీ డైరెక్టర్ చింతల ప్రశాంత్ అన్నారు. శుక్రవారం మెళియాపుట్టిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రతి రైతుకు అందుబాటులో ఉంటూ జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, కొరికాన భవానీలకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పోలాకి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పోలాకిలో సహకార సొసైటీ పరిధిలో ప్రత్యేక బ్యాంక్ మంజూరైంది. బ్యాంక్ నిర్మాణానికి తహసీల్దార్ కార్యాలయం వద్ద స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు బైరి భాస్కరరావు, సీఈవో రాంబాబు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించారు. తహసీల్దార్‌కు కార్యాలయం వద్ద బ్యాంక్ నిర్మాణానికి తగిన స్థలం చూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. బ్యాంక్ మంజూరు వల్ల నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని టీడీపీ నాయకులు ఎంవీ నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు అవగాహన

పలాస, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాన్సూన్ హైజిన్ అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు జి.బాబూజీ వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు, వ్యాధులుపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి వడపోసిన నీటినే త్రాగాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.మధు, వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, బి.వెంకటరమణ, ఎస్.శ్రీనివాస్ పట్నాయక్, బి.నర్సింహులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

కొత్తూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విధుల్లో సమయ పాలన పాటించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో వి.నీరజ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం బమ్మిడి సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన సమయానికి ఏడుగురు ఉండాల్సిన సిబ్బందికి ఒకేరే ఉండడంతో ఆమె సిబ్బందిపై మండిపడ్డారు. సిబ్బంది వివిధ పనులపై బయటకు వెళ్లారని వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ చెప్పగా.. సంతృప్తి చెందని ఎంపీడీవో సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు సిబ్బంది ఎగనామం చేస్తే ప్రజలకు ప్రభుత్వ సేవలు ఎలా అందుతాయన ప్రశ్నించారు. అనంతర రికార్డులను పరిశీలించి, సిబ్బంది ఎందుకు విధుల్లో సాయంత్రం వరకు ఉండలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

మెనూ అమలు చేయాలి

నందిగాం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వసతిగృహ విద్యార్థులకు మెనూను సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీవో టి.రాజారావు సూచించారు. శుక్రవారం నందిగాం బీసీ బాలుర వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న, అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులకు అందించి తద్వారా వారికి పౌష్టికాహారంతో పాటు విలువలు అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి వ్యాధులు ప్రబాలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వేడుకగా చిరంజీవి జన్మదినం


ఇచ్ఛాపురం: కేక్‌కట్ చేస్తున్న జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు

ఇచ్ఛాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు పట్టణంలో శుక్రవారం మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేయడంతో పాటు ప్రభుత్వాసుపత్రిలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి రోగులకు పండ్లు, బ్రెడ్లను అందజేశారు. బంగ్లా రోడ్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌లో నిరుపేదలకు అన్న, వస్త్రదానం చేశారు. అలాగే జనసేన పార్టీ కార్యాలయంలో చిరంజీవి జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెగా అభిమానులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- సరుబుజ్జిలి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా చిరంజీవి యువత ప్రతినిధి బగ్గు అప్పలరాజు ఆధ్వర్యంలో పెద్దపాలెంలో వేడుకలు నిర్వహించారు. కొత్తకోట పీఏసీఎస్ డైరెక్టర్ పైడి మురళీమోహన్ సమక్షంలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి కేక్‌కట్ చేశారు. పిల్లలకు సర్పంచ్ గురువులునాయుడు చేతుల మీదుగా పుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.
- వజ్రపుకొత్తూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాల్లో చిరంజీవి అభిమానులు కేకులు కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. డోకులపాడులో యువకులు, మహిళలు చిరంజీవి జన్మదిన వేడుకల్లో పాల్గొని కేకులు కట్ చేసి సందడి చేశారు.

బుట్టల ఏర్పాటుతో చీడలు నివారణ


లింగాకర్ష బుట్టలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వరి, కూరగాయ పంటల సాగులో పసుపు పల్లాలు, లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడంతో చీడలు నివారణతో పాటు దోమ నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయ అధికారి తోట రమణ అన్నారు. శుక్రవారం దేవాది గ్రామంలో పోలాకి, నరసన్నపేట, సారవకోట, జలుమూరు మండల ప్రకృతి వ్యవసాయ రైతులకు లింగాకర్షక బుట్టలపై అవగాహన కల్పించి పంపిణీ చేశారు. పురుగు మందులు పిచికారి చేయకుండా లింగాకర్షక బుట్టలతో చీడలు, తెగుళ్ల నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతివ్యవసాయ సిబ్బంది సీతారామయ్య, మేరి లజపతిరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.